# ట్రంప్పు చీటి

నిండు పున్నమనాటి రాత్రి వినిర్మలాకాశాన చంద్రబింబం కనిపించకపోవడం ఎంతటి విస్మయహేతువో ఆటవిడుపు కాని రోజున ఉదయం ఎనిమిది గంటలప్పుడు బడిలో పిల్లలు కనిపించకపోవడం అంతటి ఆశ్చర్య హేతువు.

ఆరోజు ఉదయం ప్రవేశించేసరికి నాకెదురైన పరిస్థితి అదే! బడి ఖాళీగా వుంది. మచ్చు కొక్కడైనా కనిపిస్తే వాడిమూలంగా మిగిలిన వాళ్ళ ఆచూకీ తెలుసుకోవచ్చు. కానీ ఆ 'ఒక్కడు' గూడా కనిపించాడు కాదు.

కలిగిన ఆశ్చర్యం నాకొక్కడికి మాత్రమే కలిగింది. హెడ్మాస్టరుగారికి కలగలేదు. కారణమేమిటంటే హెడ్మాస్టరుగారప్పటి కింకా బడికి రాలేదు.

ఒకటి రెండు నిమిషాల్లో ఆయన గూడా రానేవచ్చారు.

ఆయన నా ముఖంలోకి చూచారు. నేనాయన ముఖంలోకి చూచాను. ఆయన ముఖంలోని క్వొశ్చన్ మార్కుకు నా ముఖంలోని ఆశ్చర్యార్థకపుగుర్తే సమాధానం చెప్పి వుంటుంది.

"ఇదేమిటయ్యా గోపాలం సమ్మె కట్టడమన్నది కాలేజీల్లో జరుగుతోందని విన్నాను. కొంపదీసి అది ఎలిమెంటరీ స్కూళ్ళకుగూడా ప్రాకుతోందా ఏమిటి?" అంటూ ఆయన బిక్కమొగం వేసేశారు.

అంతలో బడిలో నెలకొన్న నిశ్శబ్దాన్ని చీల్చుకుని అనతిదూరంనుంచి తిరణాల జరుగుతున్న శబ్దంలా ఓ కలకలం వినిపించింది.

శబ్దవేది బాణంలా కలకలం వినవచ్చిన వైపుగా దూసుకెళ్ళి కిటికీ తెరిచారు హెడ్మాస్టరుగారు.

బడితోటకు హద్దుగా ముళ్ళకంపల కంచె. కంచె కావల కానుగచెట్లు. కరవాలం ఝళిపింపులకు మల్లే తృళ్ళితడుతున్న నీరెండలమధ్య కన్నతల్లి మనసులాంటి కానుగచెట్ల నీడ. ఆ నీడలోనే జరుగుతోంది తిరణాల.

భూమిలో దొరికే ముడిఖనిజంలా 'తిరణాల' అన్నది నా బుర్రలో మెరిసిన మొదటి ఊహ.

అది తిరణాల కాదు.

మరేమిటని పెద్దగా వితర్కించుకోవలసిన అవసరం గూడా లేకపోయింది. నీడలో అక్కడొకటిగా, యిక్కడొకటిగా నిలిపివున్న నాలుగైదు రెండెద్దుల బళ్ళు, ఓ బండి నిండుగా వెదురు బొంగులు, పెట్టెలు, బట్టలు, దుంకలుపడిన నారసంచులనిండుకూ సత్తుగిన్నెలు, బాగా మాసిపోయి మధ్య మధ్యలో అతుకులుపడిన గుడాపు గుడ్డలు – ఇవన్నీ చెప్పకనే చెబుతున్నాయి. వచ్చేశారు, ఊళ్ళోకి నాటకాలవాళ్ళు విచ్చేశారు.

"ఇక కుర్రాళ్ళు మనమాట వింటారా?" అన్నారు హెడ్మాస్టరుగారు.

మాటవరుసకలా అన్నారుగానీ కుర్రాళ్ళు హెడ్మాస్టరుగారి గొంతుక వినిపించగానే బిలబిలా గదుల్లోకి వచ్చేశారు.

వచ్చిన కుర్రాళ్ళు ప్రార్థన చేశారు. హాజరు చెప్పారు. పాఠాలు చదువుతున్నారు. అంటే బడి 'వర్కింగు కండిషను' లో వుందన్నమాట! ఎటొచ్చీ పరధ్యానంగా వున్నవాళ్ళం యిద్దరమే - నేనున్నూ, హెడ్మాస్టరుగారున్నూ!

కిటికీనుంచి నాటకాలవాళ్ళ కేసి నీరెండకన్నా చురచురా చూస్తున్నారు హెడ్మాస్టరుగారు.

దుమ్ముగొట్టుకుపోయిన దుస్తులు, నిద్రమత్తులో జోగుతున్న ముఖాలు, కాంతిలేని కళ్ళు. మూటలకు చేరగిలబడి కొందరు, పచ్చికపైన సాష్టాంగపడినట్లుగా కొందరు, బండి క్రింద ఆ చక్రం తలగడగా ఈ చక్రంలోకి కాళ్ళు సాచుకొని కొందరు. కడుపు చేతబట్టుకొని దేశంపైకి బయల్దేరిన తర్వాత, దేహాల పైన అట్టే అభిమానాలు నిల్పుకోడం అసాధ్యం అనుకున్నారేమో, నాటకాలవాళ్ళు ఎలా వీలైతే అలా యథేచ్ఛగా ప్రవర్తించారు. తీపి వస్తువులు తెగతిని అజీర్ణరోగం తెచ్చుకున్నట్టుగా రాత్రివేళ వేషాలుగట్టి జిలుగు వలువల తళతళలతో చెమ్కీపూతల మిలమిలలతో చూపరులకు నయనరంజనం చేయవలసివున్న వృత్తి ధర్మంలో కాలం వెళ్ళదీస్తున్న ఆ నాటకాలవాళ్ళకు తమ పగటివేషాలపైన అంతగా పట్టింపులున్నట్టులేదు. ఎడతెగని వాడకంవల్ల బిరుసెక్కి గోనె పట్టాల్లా వున్న దుస్తులతో దుబ్బల్లా ఉబ్బి దిబ్బల్లా పడివున్న గిరజాలతో మగవాళ్ళు మండి ఆరిపోయిన కొరువుల్లా ఉన్నారు. ఆడవాళ్ళను గురించి అంత మాట చెప్పటానికి వీల్లేదు గానీ వాళ్ళుగూడా వేషధారణలో సభ్యతకు అంటిపెట్టుకున్నట్టు తోచదు. గుట్టుకూ, గోప్యతకూ ఇళ్ళూ లోగిళ్ళూ కావలసి వస్తున్నాయి మానవులకు! ఆకాశం క్రింద, భూమి పైన చేస్తున్న బహిరంగ సంసారాల్లో గుట్టుకూ గోప్యతకూ ఆస్కారం లేక, అందుమూలంగా రక్తంలో జీర్ణించిపోయిన తెగువ వేషభాషల్లోనే గాదు, వాళ్ళ ప్రతికదలికలోనూ వ్యక్తమౌతుంది. మొత్తంమీద మాసిపోయి మరకలుపడి అంచుల దగ్గర చిరిగిపోతున్న కరెన్సీ నోట్లలా ఉన్నారు నాటకాలవాళ్ళు. ఖరాబైన కరెన్సీ నోట్లకు బ్యాంకులే దిక్కు! అవసరమైన హంగులకు నోచుకోక తిండికోసం తిప్పలు పడుతున్న ఆటగాళ్ళకూ, పాటగాళ్ళకూ పల్లెటూళ్ళే దిక్కయితే కావచ్చు.

ఆలోచనకు అంతరాయంగా రివ్వున గదిలోపలికి వచ్చేశారు హెడ్మాస్టరుగారు.

"ఇక చూచుకోవయ్యా తమాషా! రాత్రికి వీళ్ళిక్కడ గజ్జె కడ్తారు. అక్కడ యింటిల్లిపాదీ నాటకానికి ఆయత్తమౌతారు. మనం వద్దనుకుంటామనుకో కానీ వాళ్ళు మాత్రం మన మాట వింటారా?"

హెడ్మాస్టరుగారు స్వగృహంలో సుగ్రీవుడు. బడిలో చండశాసనుడు. పోగా ఊళ్ళో ప్రయోజకత్వం వెలగపెడుతున్న పిన్న పెద్దల్లో సగంమందికి పైగా ఆయన శిష్యులు. కానీ తుఫాను పట్టుకున్న రాత్రి విద్యుద్దీపాలను గురించి భయపడినట్టుగా ఆయన కెప్పటికప్పుడు తనమాట ఎవరూ వినరేమోనని ఓ అపనమ్మకం.

"ఐనా ఇలా ఊళ్ళమీదపడి దోచుకోడానికి వీళ్ళకెవడిచ్చాడయ్యా అధికారం? ఎలా జరుగుతుందో చూస్తాను! వీళ్ళిక్కడ పడి విలవిల తన్నుకున్నాసరే, మన ఆటస్థలంలో దేరా వేయడానికి ఒప్పుకోను. రేపీపాటికి వీళ్ళిక్కడి నుంచీ బిచాణా ఎత్తేయకపోతే నాకు మారు పేరు పెట్టు...."

ఎలా వచ్చారో అలాగే తటాలున నిష్క్రమించారు హెడ్మాస్టరుగారు. పగబూని కక్ష సాధించినట్టుగా హెడ్మాస్టరుగారు నాటకాలవాళ్ళపైన మండిపడడమెందుకో నాకర్థంగాలేదు.

అర్థమైచావని హాలీవుడ్ పటంకోసం రెండుంపావలా ముదుపు చెల్లించి, థియేటరు నుండి బయటపడగానే తలనొప్పికి తక్షణ నివారణోపాయం క్రింద స్పెషల్ కాఫీ సేవిస్తున్నాడు పట్టణంలో ప్రేక్షకుడు. ఇక్కడ వీళ్లేమో మీవి కాళ్ళు మావి చేతులని సభావందనాలు చేసి, ప్రతి వన్సుమోరును మహా ప్రసాదంగా స్వీకరించి చెంగు భిక్షంలాంటి కొద్దిపాటి రాబడికే సిద్ధపడుతుంటే ఊళ్ళపైనిబడి దోచుకుంటున్నారని చెబుతున్నారు హెడ్మాస్టరుగారు. కడుపు చించుకున్నా గారడీ విద్యేననుకోవడం యిదే కాబోలు!

నా మట్టుకు నాకు నాటకాలవాళ్ళని చూస్తుంటే ఏడుపొస్తోంది. ఎక్కడ తిన్నారో ఏమిటో వాళ్ళు పెరికి పారవేసిన తోటకూర కాడల్లా వడిలిపోయి ఉన్నారు. లేని ఓపరికం తెచ్చుకుని ఆడవాళ్ళుకొందరు మూడురాళ్ళ పొయ్యిలమరించి సత్తుగిన్నెలు పైకి తీస్తున్నారు. ఓ నడిప్రాయం ఆడమనిషి పదేళ్ళ కుర్రాడి బోడితలపైన నాలుగు వడ్డించి, రెండు కానీలకు ఉప్పూ, ఓ అణాకు మిరపకాయలూ తీసుకుని లగెత్తుకుని రమ్మంటోంది. పొయ్యికి వాటెడు చొప్పున కట్టెపుల్లలు గూడా దొరికితే నేనిక్కడ కుర్చీలో ఉండగానే వాళ్ళ వంటలైపోయేట ట్టున్నాయి. వాళ్ళకూడు వాళ్ళు తింటారు. వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతుకుతారు. అందుకడ్డుతగలడం ఏం న్యాయం? నాటకాలవాళ్ళ తరపున హెడ్మాస్టరుగారికి ఈ మాట కాస్త గట్టిగా చెప్పాలన్నంత వరకూ నాలో సదుద్దేశం అనలు తొడిగింది. కానీ హెడ్మాస్టరుగారి ధోరణి సుపరిచితమే గనుక నా సదుద్దేశం భావంలో జీర్ణంగాక తప్పలేదు.

మధ్యాహ్నం బడి వదిలిపెట్టగానే కాళ్ళీడ్చుకుంటూ యింటికి వచ్చాను. పేరుకు వర్షాకాలమైనా వానలెగదీయడంవల్ల ఎండలింకా నిప్పులు చెరిగి పోస్తున్నాయి. తిన్నశాస్త్రం ముగించేసరికి ఒళ్ళంతా చెమటతో దొప్పదోగిపోయింది. వడగాలిరాకుండా కిటికీలు మూసి గదిలో పడుకున్నాను. మాగన్నుగా నిద్రపట్టబోతుండగా పలకపైన దెబ్బ వినిపించింది. ఆ దెబ్బకు అనుపల్లవిగా ప్రచారం గూడా కొనసాగుతోంది.

మించిన దొరుకని మంచి సమయమనీ, ఆలసించిన ఆశాభంగమనీ, నేడే చూడవలసిందనీ, చూచి ఆనందించవలసిందనీ ఒకే మనిషి రెండు మూడు గొంతుకలతో నొక్కి వక్కాణిస్తున్నాడు.

నడివీధిలో సాగుతున్న ఆ ప్రచారం మూలంగా కొత్త విషయాలు చాలా తెలిశాయి. ఆ టూరింగు నాటక సంస్థపేరు బాల బ్రహ్మానంద నాటక సమాజం. వాళ్ళు ప్రదర్శించబోతున్నది 'సాటిలేని మేటి నాటకం' బాలనాగమ్మ! 'పసందైన సీన్లు, భలే భలే సెట్టింగులు, రంగు రంగుల దీపాలు' చూచి తీరవలసిందేగాని చెప్పతరం గాదని దండోరా తేటతెల్లం చేస్తోంది.

ప్రచారాన్ని బట్టిచూస్తే నటీనటులు గూడా అల్లాటప్పాగాళ్ళనిపించడం లేదు. రంగసింహ, రంగమార్తాండ యిత్యాది బిరుదాలంకృతుడు, కొక్కిరిగడ్డ జమీందారుగారిచేత దుశ్శాలువ కప్పించుకున్నవాడూ అయిన ఉంగరాల సింగరాజు మాయలమరాఠీవేషం వేస్తాడట! వెళ్ళిన ప్రతిచోటా బాలగంధర్వుడని ఆబాలగోపాలంచేత కొనియాడబడిన అలకాపురం చిట్టిబాబే బాలవర్ధిరాజట! మగవాళ్ళ వేషాలకేమొచ్చెగానీ, ప్రత్యేకించి బాలనాగు పాత్రధారిణి కనకవల్లిని గురించి కర్ణపేయంగా వర్ణిస్తున్నాడు ప్రచారకుడు.

ఆవిడ ఆడితే నెమలట! పాడితే కోయిలట! నడిస్తే రాజహంసట! ఆడకాపాడకా నడవనైనా నడవక కదలని భంగిమలో నిల్చోవచ్చుగదా? ఇందుకు గూడా ఓ సమాధానం సిద్ధంగానే వుంది ప్రచారకుడి దగ్గర! నిశ్చలంగా నిల్చుంటే ఆవిడ సింగారాల రంగమహలట!

అబ్బో, అబ్బో అని ముక్కుపైన వ్రేలేసుకుని అక్కజపడి పోతున్నారేమో వీధిలో జనం! అదను చూచుకొని అసలు విషయంలోకి వచ్చేశాడు ప్రచారకుడు - "నేల మూడణాలు. బెంచీ ఆరణాలు. కుర్చీ అర్ధరూపాయి."

రత్నగర్భగా, వసుంధరగా పేరందిన 'నేల'కు మూడణాల కిమ్మత్తు నిర్ణయించడం బాగానే వుందిగానీ ఈ నాటకాలవాళ్ళు ఆ నేలను అంతర్మధ్యంలో నిర్మించలేరు గదా! పైరుపచ్చల కాలం గనుక ఊరి చుట్టుప్రక్కల సెంటు జాగా అయినా ఖాళీగా కనిపించదు. ఆటస్థలంలో దేరా వేయడానికి హెడ్మాస్టరుగారు ససేమిరా సమ్మతించడు!

మా వూరికి సంబంధించినంతవరకూ ఈ నాటకాలవాళ్ళ కథ యిల్లలుకగానే పండుగకాదన్న నీతితో పరిపూర్తి అవుతుందేమోననే నేననుమానించాను.

నా అల్పజ్ఞత్వాన్ని అపహసిస్తున్నట్టుగా బడికి వెళ్ళేసరికి ఆటస్థలమంతటా వెదురుగుంజలు నిలబడి వున్నాయి.

అదే అద్భుతమైతే - దానిని తలదన్నేది మరొకటి - కిటికీలోనుంచి ఆ దృశ్యాన్ని ప్రసన్నవదనంతో తిలకిస్తున్నారు హెడ్మాస్టరుగారు.

"పోనీలేవయ్యా గోపాలం! వాళ్ళ కడుపుపైన కొడ్తే మన కేమొస్తుంది?" అంటూ వెనువెంటనే సంజాయిషీ!

నాటకాలవాళ్ళు ఈ అద్భుతాన్ని ఎలా సాధించారు. ఇంతటి అద్భుతాన్ని సాధించిన తర్వాత గోవా వ్యవహారాన్ని ఓ కొలిక్కి తీసుకరమ్మని పోర్చుగీసువాడి దగ్గరకు వీళ్ళనెందుకు రాయబారం పంపగూడదు?

సాయంత్రమైంది. సూర్యుడస్తమించాడు. చీకటి తెరలు మెల్లగా జారుతున్నాయి. నాటక దిదృక్షా కుతూహల సంరంభంతో ఊరు వూరంతా కోలాహలంగా వుంది. ఆ కోలాహలంలో ఏదో అపశ్రుతి వినిపించినట్లుగా తోచి వీధంట నడుస్తున్న వాణ్ణి రచ్చదగ్గర ఆగిపోయాను. నిజమే! మరొకడూ మరొకడూ కాదు - అతడు రాయుడోళ్ళబ్బాయి నాగరాజు.

"ఒరే మామిడిపిందెల రంగన్నా! మన తండ్రుల కాలాన లేదు. మన తాతల కాలాన లేదు. ఇవేం కుక్కమూతి పిందెల్రా? ఎవరో దారంట వెళ్ళే దానయ్యలు వూళ్ళోకి వచ్చి మమ్మల్ని చూడండి, మా నాటకాల్ని చూడండి అంటే కిమ్మనకుండా కూచుంటారట్రా? సుబ్బారాయడి హయాంలో అంగడిగంప వూళ్ళోకి వచ్చేదా? చివరకు బిచ్చగాళ్ళయినా పొలిమేరల్లో అడుగు పెట్టేవాళ్ళుకాదే! జోలె లాక్కుని బుడబుక్కలవాడిచేత వారంరోజులు వెట్టిచాకిరీ చేయించుకున్నవాడు మా నాన్న. మనకు ముఖాన మీసాలు లేవూ? ఈరోజు వీళ్ళయింది. రేపు యింకొకళ్ళు వస్తారు. ఐతే వచ్చినవాళ్ళకందరికీ జేబులు దోపు లిచ్చి మనం చెవల వాజమ్మల్లా ముఖం వాల్చేస్తామన్నమాట?"

"భలే మాటన్నావులే నాగరాజూ! అను, అను, నువ్వనవలసిందే, మేము వినవలసిందే" అన్నాడు రంగన్న.

గొప్పవాడి పక్కవాయిద్యం రంగన్న. ఆ విధంగా తన విద్యుక్త ధర్మం నిర్వర్తించడంలో అతడు దిట్ట.

రంగన్న కన్ను నా పైన బడింది. నాపైన బడిన అతడి చూపు పరావర్తనం చెంది నాగరాజును తాకింది. అందుకున్నాడు నాగరాజు.

"ఏమిటయ్యా అయ్యగార్లవారూ! ప్లే గ్రౌండు ఎవరిదనుకున్నారు. అది పంచాయితీ సమితివాళ్ళది. అత్తసొమ్ము అల్లుడు దానం చేయవచ్చునని మీ కెవరు చెప్పారు?"

నాకైతే ఎవరూ చెప్పలేదు. హెడ్మాస్టరుగారికి ఎవరైనా చెప్పారేమో నాకు తెలియదు. కానీ నాకొకందుకు సంతృప్తి కలిగింది. ప్లే గ్రౌండ్ పంచాయితీ సమితివాళ్ళదంటున్నాడు నాగరాజు. ఆ మాత్రపు ప్రాపంచిక విషయపరిజ్ఞానం దానంతటది చెప్పుకోదగిన గొప్ప విషయం. ఐతే నా సంతృప్తికిదే మూలకారణంగాదు. సుబ్బారాయుడు తాను బ్రతికినన్నాళ్ళు ఆటస్థలం ఆదిలో తమదేననీ, ఎన్నడో తమ పూర్వీకులను మోసం చేసి జిల్లాబోర్డు దాన్ని కాజేసిందనీ, తమ హయాంలో న్యాయంకోసం హైకోర్టువరకైనా సరే వెళ్ళక తప్పదనీ చెబుతుండేవాడు. ఈ బిడ్డ ఆ తండ్రికి కొడుకే అయినా ఆ వారసత్వాన్ని మళ్లీ తిరగ తోడుకోడం లేదు!

ఇంటిముంగిట వాలుకుర్చీ వేయించుకుని చుట్ట కాల్చుకుంటూ కనిపించారు హెడ్మాస్టరుగారు. ఆటస్థలంపట్ల నాగరాజుకు కలిగిన ధర్మసందేహాన్ని ఆయనకు తెలియజేయడం భావ్యమనిపించింది. తీరా విన్నాక పకాలున నవ్వేశారు హెడ్మాస్టరుగారు.

"నాగరాజు అంతటి బుద్ధిమంతుడయ్యాడా గోపాలం? అయితే అయ్యాడు గానీ నా ఎదుట పడడానికి వాడికి దమ్ములుండవులే! వరుసగా నాలుగు రోజులు దేశానికి ఎల్లలేవో చెప్పి అయిదోరోజున వప్పజెప్పమన్నాను. 'పడమర హిమాలయా పర్వతాలు' అన్నాడు. ఆనాడు వీపున పడిన పిడిగుద్దులు వాడింకా మరచిపోయివుండడు..."

ఊళ్ళో ఉంటే ఎల్లలేం తెలుస్తాయని సుబ్బారాయుడు కొడుకును పై చదువుల కోసం పట్టణానికి పంపించాడు. అక్కడ నాగరాజు నిలకడగా నిదానంగా పదిపన్నెండేళ్లు విద్యాభ్యాసం చేశాడు. ఐతే అభ్యాసము కూసువిద్య అన్న సామెత నాగరాజు పట్ల వక్రించిందనే చెప్పాలి. అతడు యసెసల్సీ ప్యాసయ్యాడని చెబుతారు కొందరు. అబ్బే, ఎక్కడ ప్యాసయ్యాడని ఎదురు రెట్టిస్తారు కొందరు. నిలదీసి అడిగితే నాగరాజు మాత్రం అదేమి టిదేమిటని సర్టిఫికెట్టే ధారపోయిందని చెబుతాడు.

సర్టిఫికెట్టు పోతే పోయిందిగానీ నాగరాజుకు సుబ్బారాయ డిచ్చిపోయిన సిరిసంపదలు పుష్కలంగా వున్నాయి. సేద్యం చేసి పెట్టడానికి పాలేరులున్నారు. హమేషా ఖుషీ చేయడానికి వేడుక చెలికాడు రంగడున్నాడు. ఎన్నివున్నా తన కంటూ ప్రత్యేకంగా వ్యాసంగమేమీ లేకపోవడం వల్ల నాగరాజుకు ఒకొక్కప్పుడు పిచ్చి పట్టినట్టయిపోతుంది. అప్పుడతడు మొండిగా గ్రహచారం చాలని వాళ్ళపైకి తిరగబడతాడు. జగడానికి రా దీస్తాడు. రెండు రెండ్ల నాలుగు పగ్గాలు వేసి ఒక్కుమ్మడిగా పదిమంది వెనక్కులాగుతున్నా లెక్కచేయక మోరవంచుకుని బుసలు కొడుతూ ముందుకు పోయే పోట్లగిత్తలా కయ్యానికి కాలు దువ్వుతాడు. అటువంటి సమయాల్లో నిజంగా అపాయకరమైన మనిషి నాగరాజు.

అలాంటి నాగరాజు నాటకాల వాళ్ళపైన కన్నెర్ర చేస్తున్నాడు.

నా గుండె గుబగుబలాడిన మాట నిజం.

వాళ్ళా దిక్కులేని పక్షులు. వీడా వీరభద్రుడు. కారణానికేమి? గొర్రెపిల్లపైన తోడేలుకు దొరికినట్లు నాగరాజుకు కూడా ఒక కారణం దొరక్కపోదు.

నాకిప్పుడు నాటకం చూడాలని లేదు. పొట్టికథగా, బుర్రకథగా, నాటకంగా, సినిమాగా ఎన్నోసార్లు విన్నదే, కన్నదే బాల నాగమ్మ కథ. మరుక్షణాన జరిగేదేమిటో వూహకందని జగన్నాటకంతో పోల్చిచూస్తే ఏ రంగంలో ఏమి జరుగుతుందని వూహించుకోడానికి వీలున్న మామూలు స్టేజీ నాటకం ఏపాటిది?

కాలం ఆగదు. పరుగెడుతుంది. కాలమన్న రైలుబండి పరుగెడుతూ విడిచి పెట్టిన ఆవిరిలా చీకటి రోదసీ కుహరమంతటా వ్యాపించింది. మధ్యాహ్నం నుంచీ గ్రామంలోనూ, చుట్టుప్రక్కల పల్లెల్లోనూ సాగించిన ప్రచారం చాలక నాటకాల వాళ్ళు ఎడతెగకుండా డప్పులు మ్రోగించేస్తున్నారు. ఎనిమిది గంటలకల్లా దేరాచుట్టూ సందడి ప్రారంభమైంది. దివిటీలు పట్టించుకుని లాంతర్లు చేత పట్టుకుని పల్లెజనం కాలిబాటల వెంట బారులు కట్టి వస్తున్నారు.

దీపాల కాంతితో, డప్పుల మ్రోతతో దూరపు చూపుకు నాటకాల దేరా గాంభీర్యం వెలార్చుతున్న మాట నిజమే! కానీ దగ్గరికి వెళ్ళి చూస్తే దాని దైన్యావస్థ బాహాటంగా బయట పడుతుంది. భూమిలో నాటిన సన్నటి వెదురు గుంజలను గ్రామీణ స్త్రీలు ఎడమచేతితో వూడలాగి మోకాటి క్రింద నాలుగు తుంటలుగా విరిచి వంట చెరుకుగా వాడుకోవచ్చు. గుంజలకు కట్టిన పరదా గుడ్డలు ఎండకెండి వానకు తడిసి మగ్గిపోవడం మూలాన కించిత్తు బలప్రయోగానికైనా తట్టుకునేటట్టులేవు. పోనీ మందీ మార్బలం సంగతి చూద్దామంటే ఈ నాటకాల వాళ్ళందరూ గట్టిగా గాలివీస్తే పైకెగిరి పోయేటంత బలంగా వున్నారు. ఇలాంటి సాధన సంపత్తితో వీళ్ళు దేశం పైకి ఎగబడి వచ్చారు. మేము నాటకాలు వేస్తాము చూడండహో అంటూ టాంటాం వేశారు. అలాగని వీళ్ళు నాటకాలు వేయలేరని నేననుకోవడం లేదు. కానీ వీళ్ళను వేయనిస్తారా అన్నదే నా సందేహం.

గుమికూడిన జనంలో కేవలం నాటకాన్ని చూచిపోదామన్న సదుద్దేశంతో వచ్చినవాళ్ళు మాత్రం టికెట్టు కొనుక్కుని దేరా లోపలికి వెళ్ళిపోయారు. కానీ అలా వెళ్ళిన వాళ్ళు పరిమిత సంఖ్యాకులు. నూటికి పది పదిహేను మంది కన్నామించరు. మిగిలిన వాళ్ళకు టికెట్టు కొనుక్కోవాలన్న ధ్యాసే వున్నట్టులేదు. ఇంత మందిమి మేమిక్కడ బయటుండగా మీరు నాటకం ఎలా వేయగలరని ప్రశ్నిస్తున్నట్టుగా వాళ్ళు టికెట్లిస్తున్న వ్యక్తివైపు కొరకొర చూస్తున్నారు.

గంట తొమ్మిదైంది.

"నాటకం ఆరంభమౌతుంది బాబూ! అందరూ టికెట్లు కొనుక్కోవాలి!" తెర వెనుకనుంచి మెగా ఫోనులో హెచ్చరిక వినిపించింది.

అయినకాడికీ ఆరడుగుల దాకా పెరిగి, నిటారుగా నిల్చోడానికి వెన్నుకు దన్ను లేకపోవడంతో మధ్యలో వంగి, ఉపయోగానికి దూరమై మూలబడి త్రుప్పుబట్టిపోయిన కొడవలి కత్తిలావున్న ద్వారపాలకుడు తృళ్ళిపడ్డాడు. హెచ్చరికను వినిగాదు– తన ఎదుట నిల్చున్న జనసందోహాన్ని చూచి!

వందల సంఖ్యలో వున్నారు ప్రేక్షకులు. ఒక్కడి చేతిలోనైనా టిక్కెట్టు లేదు!

"టికెట్లు బాబూ! టికెట్లు!" ఆక్రోశించాడు ద్వారపాలకుడు. ఆ అంగలార్పుకు ప్రత్యుత్తరంగా ఓ పెద్దమనిషి అతడిపైకి వంగి చెవిలో మంత్రోపదేశం చేస్తున్నట్టుగా "కరణంగారి కుటుంబం" అన్నాడు.

మంత్రముగ్ధమైన భుజంగంలా ద్వారపాలకుడు దారిలోనుంచి వైదొలిగాడు.

కరణంగారి కుటుంబమన్న బురఖాక్రింద ముసలీ ముతకా, పిల్లాజెల్లా, ఆడామగా అంతా కలిసి పాతిక మందికి తక్కువ గాకుండా దేరాలోపల ప్రవేశించారు.

ఆ తండా అలా లోపలికి వెళ్లగానే వేరొక మురా ద్వారం ఎదుట ప్రత్యక్షమైంది.

"మునసబుగారి యిలాకా!" అన్నాడు ముఠా నాయకుడు. మునసబుగారి యిలాకాలో ముప్పైమందికి తక్కువగా లేరు.

"చిత్తం బాబయ్యా, చిత్తం!" అన్నాడు ద్వారపాలకుడు. అతడి గొంతుకలో తడిలేదు.

కరణంగారి బృహత్కుటుంబమూ మునసబుగారి మూలబలమూ దేరాలోపల సుఖాసనాల కోసం అన్వేషిస్తున్న అలజడి ఇంకా తగ్గనేలేదు. దిగాలు పడిపోయిన ద్వారపాలకుడింకా తేరుకోనేలేదు. అంతలో ప్రెసిడెంటుగారి మనుషులని చెప్పుకుంటూ యింకొక బలగం అక్కడ సాక్షాత్కరించింది.

వచ్చినవాళ్ళు విచ్చుకత్తుల్లా కాసేపు నిల్చున్నారు. వాళ్ళ ఎట్టయెదుట నిల్చున్న ద్వారపాలకుడు నిశ్చేష్టుడు. పాపం, వాళ్ళు మాత్రం ఎంతసేపని వేచి చూస్తారు? దారిలో నుంచి అతణ్ణి తొలగించుకుని హుటాహుటిగా లోపలికి వెళ్ళిపోయారు.

చావు తెలివిలాంటి తెచ్చికోలు తెగువ ఒకటి ద్వారపాలకుడి ముఖంలో చిరచిరలాడింది. తన పక్షానికి అపజయం ఖాయమని తెలిసినప్పటికీ ఆఖరు ప్రయత్నం చేస్తున్న వీరభటుడిలా అతడు ముందుకు వచ్చాడు. "దండాలు బాబూ దండాలు" అంటూ జనసమూహాని కొకసారి చేతులు జోడించి వెంటనే ద్వారాని కడ్డంగా చేతులు చాపేశాడు. "పెద్దలూ చిన్నలూ అందరూ చిత్తగించాలి. కూటికోసం కోటి విద్యలు. అందులో ఒక విద్య మాది. దీన్ని నమ్ముకుని మేమిలా దేశంపైన తిరుగుతున్నాము. మహారాజులందరూ మాపైన దాక్షీకం చెలాయించాలనుకుంటే మేము బ్రతకలేము. వెళ్ళిన వాళ్ళు లోపలికి వెళ్ళారు. ఇకపైన ఒక పిట్టకూననైనా ఉచితంగా లోపలికి వదలడానికి వీల్లేదు..."

ద్వారపాలకుడి విజ్ఞాపనం పూర్తికానున్నదనగా అతనికి నాలుగు బారలదూరంలో వున్నాడు నాగరాజు.

ఎలా ఉన్నాడు?

తనలాంటి వాళ్ళు యిద్దరు ముగ్గురు సునాయాసంగా దూరిపోదానికి వీలున్న పైజామా వేశాడు. అలాంటిదే పసుపురంగు సిల్కు జుబ్బా తొడుక్కున్నాడు. మెడకు రుమాలా చుట్టాడు. లాటీకర్ర చేతబట్టాడు. సిగరెట్టు పొగల వలయాలు బరాబరులు పలుకుతుండగా ధనుర్ముక్తమైన బాణంలా రివ్వున ద్వారందగ్గరికి వచ్చేశాడు.

వచ్చినవాడు నాగరాజొక్కడే కాదు.

ఫిరంగిలాంటి రంగడు. చాకులాంటి రజాకు. క్రుద్ధవృకోదరుణ్ణి తలపించే ముద్దుస్వామి. పందెపు కోడిపుంజులాంటి ఆంజనేయులు – వీళ్ళేకాదు, నాగరాజును పరివేష్టించి వున్న మిత్రబృందంలో యింకా హేమామేమీలు పలువురున్నారు.

"దారి వదులు!" ఆజ్ఞాపించాడు నాగరాజు.

"వీల్లేదు. ప్రాణంపోయినాసరే దారి వదలను. టికెట్లు కొనుక్కోవాలి. లోపల అడుగు పెట్టాలి" అన్నాడు ద్వారపాలకుడు.

నాగరాజు ముఖంలో ఓ కోపవీచిక విసురుగా పారాడింది. "టిక్కెట్లు! ఎక్కడున్నాయి టిక్కెట్లు? ఒరే రంగడూ. అందుకోరా టిక్కెట్లు..."

నాగరాజు హుకూం జారీచేసిన మరుక్షణంలో టిక్కెట్ల పుస్తకం రంగడి చేతిలో వుంది.

టిక్కెట్లిస్తున్న మనిషి మధ్య ఆఫ్రికాలో పిగ్మీలాంటి కుబ్జుడు. ఆ స్వల్పశరీరంలో ఆపాటి సాహసం దాగి వుంటుందని ఎవ్వరూ వూహించి వుండరు. అతడు తోడేలు

పిల్లలా చెంగున రంగడిపైకి లంఘించాడు. టిక్కెట్ల పుస్తకాన్ని ఒడిసి తన చేతిలోకి లాక్కున్నాడు.

అవమానభారంతో రంగడు అగ్గిపైన గుగ్గిలంలా కస్సుమని పైకిలేచాడు. అవలీలగా కుబ్జుణ్ణి పైకెత్తి నిలువెత్తునుంచీ చింతపండు మూటలా క్రింద కుదేశాడు. గిరజాలు పట్టుకుని నీళ్ళల్లో ముంచి లేవనెత్తినట్టు అదేపనిగా కుదిపివేయసాగాడు.

రంగడి చేతిలో నజ్జుగుజ్జయిపోతూ కుబ్జుడు పెట్టిన గావుకేకలకు తల్లుల చంకల్లోని పసిబిడ్డలు వులిక్కిపడి కెవ్వున ఏడుపు లంకించుకున్నారు.

సగం సగం వేషాలతో బయటపడిన నాటకాల వాళ్ళకు అక్కడ జరుగుతున్న దేమిటో స్పష్టంగా అవగాహన చేసుకునే వెసులుబాటు లేకపోయింది. చిమ్మ చీకటి దారిలో నడుస్తూ భయం లేకుండా వుండటానికని గొంతెత్తిపాడుకునే ఒంటరి పాంథుడిలా వాళ్ళు "పట్టు, కొట్టు, తన్ను" అంటూ కంఠశోష పెట్టుకున్నారు.

నాగరాజు కళ్ళు విస్ఫులింగాల్లా మండుతున్నాయి. తీవ్రమైన కోపానికి చిహ్నంగా అతడి ముక్కుపైన చిరుచెమట పొటమరించింది. ముడిపడిన ఫాలతలంలో, వంకరలు తిరుగుతున్న పెదవులతో అతడొక్కసారి హుమ్మని హుంకరించాడు. నాగరాజు మిత్రులకు అహంకారాన్ని మించితే ఆజ్ఞాపత్రాలనవసరం! వాళ్ళు ఔడుకరచుకుని పిడికిళ్ళు బిగించుకుని ప్రేలుతున్న చిచ్చుబుడ్లకు మల్లే రంగంలోకి దూకేశాడు.

"చితకదన్నండి. చావబాదండి. గుంజలు పెరకండి. పరదాలు చించండి. పందిరి పీకండి" అంటూ ఏకధాటిగా నినాదాలిచ్చేస్తున్నాడు నాగరాజు.

ఉరుముల్లాంటి నినాదాలతో బాటుగా గాలివానలాంటి గగ్గోలుకూడా ప్రారంభమైంది. పెళీ పెళీ మని చెంప లదిరిపోతున్నాయి. పర్రు పర్రున పరదాలు చిరిగిపోతున్నాయి.

ఒకటి...రెండు...మూడు... నిమిషాలు గడిచిపోతున్నాయి. ఎర్రగా పైకిలేస్తున్న ఎండుదుమ్ములో వలయాకృతిలో ముందుకు విరగబడుతున్న జనసమూహం మధ్య కొమ్ము టేనుగుల వంటి పల్లెటూరివస్తాదుల చేతుల్లో నాటకాల వాళ్ళు చలిమిడి ముద్దలై పోతున్నారు. ప్రేక్షకుల్లో ఎవరి ముఖంలోకి చూచినా ఒక్కటే ప్రశ్న! ఏమౌతారు? ఈ నాటకాల వాళ్ళు ఏమౌతారు? ఎవరి ముఖం చూచి వీళ్ళీ వూళ్ళో కాలు మోపారు?

ఈ ప్రశ్నకైతే జవాబు వినిపించలేదుగానీ చుట్టూరా చెలరేగుతున్న గందరగోళంలో అప్పుడొక విచిత్రం సంఘటించింది. యమునా నది విచ్చుకున్నట్టుగా జనంలో ఓ చీలిక ఏర్పడింది. కారుచీకటిలోకి ప్రసరిస్తున్న కాంతి కిరణంలా ఆ చీలికలో ఓ వెలుగు కనిపించింది. ఏమై ఉంటుందది? అపరంజి బొమ్మకాదు. బొమ్మయితే కదలదు. పూలరెమ్మకాదు. రెమ్మయితే నడవదు. సముద్ర మథనం లాంటి రగడ జరిగిపోయిన తరువాత అమృతంలాంటి ప్రశాంతతను ప్రసాదించడానికి అవతరించిన అభినవ మోహినీ దేవత ఈవిడేనంటే ఒప్పుకోని సంశయాత్ముడెవ్వడూ అక్కడలేదు.

ఆమెను ఆలంబనంగా చేసుకుని రూపమూ, వేషమూ పోటీకి తలబడ్డాయి. రూపానికి పరిరక్షణ కల్పిస్తున్నట్టు నటిస్తూ వేషం ఆమె అందచందాలను విస్పష్టం చేసివేస్తోంది. నెన్నడుముకు బిగించిన వడ్డాణం దగ్గర రూపం వేషానికి బాగా లొంగిపోయి, కంచుకం దగ్గిర మిడిసి పడుతూ విజయ గర్వాన్ని చాటుతోంది. ఆమె ఎలా వచ్చింది? వెలుగుతున్న కాకరపువ్వొత్తిలా వచ్చిందా? మెరిసి పోతున్న క్రొక్కారు మెరుపులా వచ్చిందా? ఇదిగో, యిలా వచ్చిందని చెప్పడానికి అక్కడ మానసికంగా మేలుకొనివున్న వాడొక్కడూ లేడు.

ప్రాణరహస్యం తెలుసుకోడానికి మాయల మరాఠీని దరిసిన బాలనాగులా ఆమె నాగరాజును సమీపించింది.

నాగరాజులో చలనం లేదు.

నాగరాజు కళ్ళకు రెప్పపాటు లేదు.

నాగరాజు మనసు మెలకువగాలేదు.

"బాబుగారు మన్నించాలి!" అభినయం పట్టినట్టుగా ఆమె నమస్కరించింది. "మావాళ్ళకు బుద్ధిమట్టు. కాకపోతే ఏమాత్రం నిరవాకం వెలగబెడతారని తెలియకముందే టికెట్లు కొనుక్కోవడం ఏం న్యాయం? బాబుగారు వీళ్ళకు బాగా బుద్ధి చెప్పారు.... ఇదిగో రాయప్పా ఈరోజు మారాజులు ఉచితంగానే చూస్తారు నాటకం! మనసుపడితే రేపు వాళ్ళే వేయించుకుంటారు. అయిదు నిమిషాల్లో పరదాలన్నీ విప్పించేయాలి నువ్వు" ఆమె మళ్ళీ నాగరాజువైపు తిరిగింది. "జరిగిందేమిటో జరిగిపోయింది. బాబుగారదంతా మనసులో వుంచుకోగూడదు. మాతోగూడా దయచేసి, తమరు ముందరి కుర్చీలో కూచుంటే గానీ తెర లేవదు..."

ఆమె ముందుగా నడిచింది. నాగరాజు ఆమెను వెంబడించాడు. అతని మిత్రబృందం అతణ్ణి అనుసరించింది. మిగిలినవాళ్ళు ఎక్కడివాళ్ళక్కడే సర్దుకున్నారు. అయిదు నిమిషాల్లో తెరలు విప్పేశారు. పదినిమిషాలకల్లా హార్మోన్యం మ్రోగింది. పదిహేను నిమిషాలు గాకముందే నాటకం ప్రారంభమైంది.

భూలక్ష్మీదేవి వ్రతం, నాగేంద్రుడి శాపం, సంతాన ప్రాప్తి, శాపఫలం, మాణిక్యాలదేవి కుతంత్రం, అరణ్యవాసం, బంధు సమాగమం - యిలా చకచకా నడిచి బాలనాగమ్మ యౌవన ప్రాంగణంలో కాలు మోపడంతో కథ రసపట్టులోకి వచ్చేసింది.

విరిసీ విరియని విరుల్లో పొరలే మకరందంలాంటి వలపు తలపులు మధుర భావనలతో పరవశమౌతూ బాలనాగమ్మ పాడుతోంది:

"నవవసంతోదయము నేడే నాలోన
నవభావములు లేచి పురివిప్పియాడే
ఎలమావి గుబురులో కలకంఠి కూసె
మల్లికా పరిమళము మధురముగ వీచె
ఎందుకో మరి నేను ఎరుగనైతిగానీ
ఈ లేతగుండెలో వెన్నెలలు పూచె."

పాడుతూ ఆడుతున్న బాలనాగమ్మ రంగురంగుల విద్యుద్దీపాల కాంతులను తనలో అంతర్లీనం చేసుకుని పైకెగసి శతముఖాలుగా క్రింద పడుతున్న జలధారలా వుంది. అభినయానికి అసువులు పోస్తూ మాట మాట కొకరకంగా మారిపోతున్న అంగవిన్యాసంతో, హావ భావాలతో ఆ జవ్వని తన స్థూలరూపాన్ని రంగంపైన్నే వదిలిపెట్టి సూక్ష్మరూపంలో ప్రేక్షకుల మానసాంబరంలో అప్సరసలా ఆనందలాస్యం సలుపుతోంది. ఆ రంగం ముగిసింది. నాటకం పరుగిడుతోంది. అసలైన కార్యవర్థిరాజు సంగతేమిటోగానీ బ్రా. బ్ర.నా. సమాజం వారి కార్యవర్థిరాజు మాత్రం వాళ్ళ బాలనాగమ్మ పాలిటికి దొండపండుకు కాకి ముక్కులా దాపురించాడు. ఆ మాటకొస్తే అతడే కాస్తనయం! మాయల మరాఠీ వేషగాడైతే అమాంతంగా పైకి తెచ్చుకుంటున్న కృతకావేశంలో చిరుగాలికి కదిలే పొడుగాటి బెలూనులా ఏ క్షణానికాక్షణమే టుప్పున పగిలి పోయేటట్లున్నాడు. కానైతే

ఉన్న లోపాలేవీ నాటక గమనానికి ప్రతిబంధకంగా నిలకడం లేదు. బాలనాగమ్మ చుట్టూ గిరికీలు తిరుగుతున్నాయి. పాత్రలకు, కథకు డిటోగా ప్రేక్షకుల చూపులూ, మనసులు గూడా అదేపని చేస్తున్నాయి.

* * *

మరునాటి ఉదయం కథలో యిదివరకు పడిన ముడి ఒకటి విడిపోయింది.

టీచర్సు అటెండెన్సులో సంతకం పెట్టదలచుకుని జేబులో చేయివేస్తే కలం కనిపించిందిగాదు. "కలం యింటిదగ్గర మరచిపోయినట్టున్నాను. మీకలం ఓ మాటిలా యిస్తారా?" అంటూ హెడ్మాస్టరుగారివైపు చూచాను.

"కలమా! అదెక్కడుంది. ఆ నాటకాలావిడ తీసుకెళ్ళి పోయిందిగా?" అన్నారు హెడ్మాస్టరుగారు.

ఏ నాటకాలావిడ? నా బుర్రకేమీ అర్థమయిందిగాదు.

"ఆవిడేనయ్యా. రాత్రి బాలనాగమ్మ వేషం వేసిన కనకవల్లి! నిన్న మధ్యాహ్నం నువ్వలా యింటికి వెళ్ళావేమో, ఆవిడ చక్కా స్కూల్లోకి వచ్చేసింది. ఆట స్థలంలో దేరా వేసుకోడానికి అనుమతిస్తే గాని దారివదలనంటూ మారాంచేసింది. పోనీ ఏ అమ్మగన్న ఆడకూతురో ననుకుని వేసుకుని తొలగండన్నాను. ఆ అమ్మాయి అంతటితో నన్నెక్కడ వదిలిపెట్టింది? 'కాస్త మీ కలం యిప్పిస్తారా మేష్టారూ? పాటలు రెండు వ్రాసుకోవాలి....' అంటూ బ్రతిమాలుకుంది..."

ఏడు సముద్రాల కవతల బంగారు పంజరంలోని చిలకలో నిక్షిప్తమైవున్న మాయలమరాఠీ వాడి ప్రాణంలా హెడ్మాస్టరుగారి ప్రాణమంతా ఆయన కలంపైనే వుంటుంది. ఇతరులు దాన్ని ముట్టుకోడానికి ఆయన ఒక పట్టాన ఒప్పుకోరు. అలాంటి హెడ్మాస్టరుగారు తమ నియమాన్ని సడలించుకోవలసి వచ్చిందంటే - ఏ అమ్మగన్న ఆడకూతురైతేనేమి - ఆ నాటకాలావిడ సామాన్యురాలై వుండదు.

మధ్యాహ్నమయ్యేసరికి వూరంతా అట్టుడికి పోతోంది. ఎవరినోట విన్నా అదే వార్త. ఇకమీదట నాటకాల వాళ్ళు తమ స్వంత బాధ్యతతో నాటకాలు వేయరు. ప్రదర్శనాలను నాగరాజు కంట్రాక్టు చేసేశాడు. డబ్బు వసూలైనా కాకపోయినా అతడు నాటకాల వాళ్ళకు ప్రదర్శనం ఒకటింటికి రెండువందల యాభై రూపాయలిచ్చేస్తాడు.

రెండువందల యాభైరూపాయలు! ఇదేమంత చిన్న మొత్తంకాదు. ఇంతటి భారీ ఎత్తులో కంట్రాక్టుచేసిన తర్వాత నాగరాజు తన ప్రయత్నాల్లో తానుండడంలో ఆశ్చర్యమేమీలేదు. పకడ్బందిగా రూపొందించుకున్న తన కార్యక్రమంలో మొదటి అంశంగా అతడు వాములు విప్పించి జొన్నచొప్ప తెప్పించి పరదాలకు బదులు దడి కట్టించేశాడు. మనుషుల్ని పంపించి పట్టణం నుంచి మైకుసెట్టు, కరెంటు దీపాలు తెప్పించాడు. మూరెడుపొడుగు కరపత్రాలు అచ్చువేయించాడు. నేల నాలుగు చెరగులా ప్రచారం చేసుకరావడానికి ఒంటెద్దు బళ్ళతో సహా నాలుగు జట్లను నియమించాడు.

'కష్టే ఫలే' అన్నారు. నాగరాజు కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తున్నట్టే తోచింది. రెండో ప్రదర్శనానికి మూడువందల రూపాయలదాకా వసూలైనట్టు చెప్పుకున్నారు. 'మోతుబరి గావచ్చు. వాడి తాత గావచ్చు. ఎవడి కొమ్ములు దిరిగిన తనం వాడియింటివరకే చెల్లుబాటు. దేరాదగ్గరకివస్తే మొదట టికెట్టు, తరువాత ప్రవేశం' అంటూ నిక్కచ్చిగా చట్టాన్ని అమల్లో పెట్టేశాడు నాగరాజు.

హెడ్మాస్టరుగారంతటివారు ముఖం వెలవెల బోతుండగా "చూచావా గోపాలం? ఓడలు బండ్లవుతాయంటే ఏమిటో ననుకునేవాణ్ణి. రాత్రి నాటకానికి నేనుగూడా టికెట్టు కొనుక్కోవలసి వచ్చింది!" అన్నారు.

రోజులు గడిచిపోతున్నాయి. నిర్విఘ్నంగా సాగిపోతున్న నాటకాలపైన, వాటిని నిర్వహిస్తున్న నాగరాజుపైన ప్రకృతి కినుక పూనినట్టుగా ఓ రోజు ఉదయం ఆకాసమంతటా మబ్బులు కనిపించాయి. ఆకు కదలకుండా నిశ్చలంగా వుండిపోయిన వాతావరణం సాయంత్రానికి దయ్యం ఆవేశించిన మనిషిలా మారిపోయింది. కిటికీలు మూసుకుని, తలుపులు బిడాయించుకుని ఇళ్ళల్లో కూర్చున్న గ్రామస్తులు గాలివానలో కానుగ చెట్లక్రింద నాటకాలవాళ్ళ దురవస్థను గురించి తలపోసుకొని జాలిపడ్డారు. కానీ వాళ్ళలా దిగులు పెట్టుకోవలసిన అవసరం ఏమాత్రమూలేదని తేల్చిపారేశాడు నాగరాజు. అప్పటికప్పుడే అతడు పెళ్ళిళ్ళు చేయడానికి అనువుగా సుబ్బరాయుడు కట్టించిపోయిన చుట్టు భవంతి ఇంటిని ఖాళీ చేయించి, అందులో నాటకాలవాళ్ళకు విడిది ఏర్పాటు చేసేశాడు.

వెచ్చగా విడిది దొరికితే మాత్రం చాలదు. తిండికి పూచీ లేనిదే ప్రాణాలకు హాయిలేదు. పనిలో పనిగా షావుకారు చెంచయ్య కొట్లో నాటకాలవాళ్ళకు కావాలిసిందల్లా యిచ్చి తన ఖాతాక్రింద లెక్క వ్రాసుకోమన్నాడు నాగరాజు. బసచేయడానికి పెళ్ళివిడిది. దినవెచ్చాలకు చెంచయ్య కొట్టు. నాటకాలవాళ్ళ పని మోతగా వుంది. దినం మంచిదనిపిస్తే పగలే దొంగతనానికి పూనుకోవడం మానవ స్వభావం. నాటకాలవాళ్ళు యించుమించుగా అదే పని చేశారు. నాగరాజు 'మంచితనం' ఆసరాగా వాళ్ళతడి జవిళంగడి ఖాతాలో గూడా జోక్యం కలుగజేసుకున్నారు. గ్లాస్కోపంచలేనా, కంచి చీరలేనా, సిల్కు చొక్కాలేనా- ఓయబ్బో - పెళ్ళికి తరలి వచ్చిన చుట్టాల్లా కనిపించారు. మగవాళ్ళు పూలరంగళ్ళు. ఆడవాళ్ళు సీతాకోక చిలుకలు.

నాటకాలకు తీరని ఆటవిడుపులిచ్చి, వానలేమో విడువకుండా ముమ్మరించు కున్నాయి. కొట్టులో ఖాతాగూడా ముసారా వానలతో పోటీకి దిగి నిర్విరామంగా పెరిగిపోతుంది.

రొంపికీ రొచ్చుకూ వెరచి కాలుదీసి బయట పెట్టడానికి బుద్ధిపుట్టక ఎక్కడి వాళ్ళక్కడ దుప్పట్లు కప్పుకుని, కుంపట్లు రగిలించుకుని కాలక్షేపం చేస్తున్న ఆ వర్షాకాలపు రాత్రుల్లో ఒకనాటి రాత్రి ఎనిమిది గంటలప్పుడు ఎవరో తలుపు తడుతున్నట్టు తోచి గబగబా వెళ్ళి గడియ తీశాను. వచ్చినవాడు నాగరాజు!

గొడుగు పట్టుకున్నాడు. చెప్పులు తొడుక్కున్నాడు. పంచ తాలూకు చెంగులు ఎత్తి పట్టుకున్నాడు. తలుపు తెరవగానే లోపలికి వచ్చి గదిలో ప్రవేశించి కుర్చీలో కూర్చున్నాడు.

నాగరాజలా నన్ను వెదుక్కుంటూ మా యింటికి రావడానికి అది మొదటిసారి. అది చివరిసారి కూడా!

కుర్చీలో కూర్చున్న నాగరాజు పది పదిహేను నిమిషాల దాకా పెదవి కదిపాడు కాదు. ఆలోగా నేను నాలుగైదుసార్లు అతణ్ణి మాటల్లోకి దించడానికి ప్రయత్నించాను.

చివరికెలాగైతేనేం, నాగరాజు నోరు తెరిచేశాడు.

"చూడు గోపాలం! నువ్వు చేస్తున్న ఉద్యోగం మూలంగా నీకు నెలకేమాత్రం గిడుతుందేమిటి?" అంటూ సూటిగా ప్రశ్నించాడు నాగరాజు.

ఆశ్చర్యాతిరేకంలో నుంచి తేరుకుని "ఎంతో ఎందుకు గిడుతుంది నాగరాజూ? విద్యాయోగ్యతనుబట్టి, సర్వీసునుబట్టి నెలకో వంద రూపాయలిస్తున్నారు." అన్నాను.

"నేను వందాయాభై రూపాయలిస్తాను" అన్నాడు నాగరాజు.

"ఎందుకూ?" నా ఆశ్చర్యానికి ఎల్లలులేవు.

"ఏముందీ! ఎలాగూ నేను నాటకాల కంపెనీ ప్రారంభించబోతున్నాను. నువ్వు నాటకాలు వ్రాస్తావు. ఇదివరకూ వ్రాశావో లేదో నాకు తెలియదు. పోనీ – వ్రాయగలవు. సరే, మనం వూళ్ళ పైనబడి నెలకు పది పదిహేను ప్రదర్శనాలిస్తాము. తెరలకనీ, సెట్టింగులకనీ, దుస్తులకనీ నేను పదిపదిహేను వేలదాకా పెట్టుబడి పెట్టబోతున్నాను. వేలం వెర్రిగాబడి 'మాబ్'ను ఆకర్షించదానికి కనకవల్లి వుండనే వుంది..."

పది గంటలవరకూ తాను తలపెట్టిన ఉద్యమాన్ని గురించి వివరిస్తూ కూర్చున్నాడు నాగరాజు. కీడెంచి మేలెంచడం మంచిదని మాటి మాటికీ నేను ప్రకటిస్తూ వచ్చిన అనుమానాలను టకీటకీమని ఖండించేశాడు. మానసికంగా ఆకాశానికి మూడే బారల దూరంలో వున్నాడు నాగరాజు. ఆ పరిస్థితిలో ఎదుటివాడి సలహాలు అతనికి రుచించవని తెలుసుకోడానికి నాకు రెండు గంటల కాలం పట్టింది.

మళ్ళీ నాలుగు రోజులు గడచిపోయాయి.

వానలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఆ రోజు ఎండ కూడా పెళ్ళున గాసింది. చెరువు కట్టపైకి షికారు వెళ్ళి తిరిగి వస్తున్నాను. ఊరికింకా ఫర్లాంగు దూరంలో ఉండగానే పెద్దగా రభస వినిపించింది. పాతికేళ్ళ క్రిందటి స్థానిక చరిత్రలో నెల రోజులకొక రగడ, ఆరుమాసాలకొక దొమ్మీ, ఏడాదికొక ఖూనీ- యిదీ ఆనవాయితీ! చరిత్ర మళ్ళీ మళ్ళీ పునరావృతం అవుతుందంటారు. అలాగైతే పై మూడింటిలో యిప్పుడు జరుగుతున్న దేమిటో నా ఊహ కందిందిగాదు. ఆ ఫర్లాంగుదూరం నేను నడిచివచ్చానని చెప్పలేను. ఊరు వూరంతా నాలుగు వీథుల కూడలిలో ప్రోగయింది. మధ్యలో దుడ్డుకర్ర లొక దానితో ఒకటి మోదుకుంటున్నాయి. తిట్లు, తృణీకారాలు, బూకరింపులు, భుజస్ఫాలనాలు ఎడతెగకుండా వినిపిస్తున్నాయి. ఉన్నట్టుండి ఒక మూలనుంచి శిలావర్షం గూడా ప్రారంభమైంది. జనం చెల్లాచెదురుగా పారిపోతున్నారు.

ముందుకు పరుగిడుతున్న నా కాళ్ళకు బంధాలు పడ్డాయి. హఠాత్తుగా అడ్డు తగిలారు హెడ్మాస్టరుగారు.

"ఆగవయ్య గోపాలం! కొంపదీసి వాళ్ళెవరైనా మనల్ని సాక్ష్యానికి వేసుకుంటే కోర్టు వెంట తిరుగుతూ యిక్కడ బడి మూసేయవలసి వస్తుంది. మనకెందుకు గానీ వెళ్దాం పద" అంటూ ఆయన నన్ను వెనక్కు నడిపించారు.

"ఇంతకూ అక్కడ జరుగుతున్న దేమిటండీ?" అని ప్రశ్నించాను.

"జరగడానికేముంది? ఆ కత్తెర మీసాల శంకరంగాడు లేడూ! అతగాడిటీవల నాటకాల వాళ్ళని విడిచిపెట్టి వుండటం లేదు. కనకవల్లి సముఖంలో అతడు నవ్వుతూ ప్రేలుతూ నయగారాలు పోతుండగా నాగరాజు ఒకటి రెండు సార్లు మందలించాడు. ఫలితం కనిపించలేదు. అంతటితో అతణ్ణి పట్టుకుని నడివీథిలో మక్కెలు విరగదన్నాడు నాగరాజు. ఆ శంకరం గాడికి గూడా ఊళ్ళో ఓపినంత బలగం వుంది గదా! వాళ్ళూ వీళ్ళు జుట్లు పట్టుకుంటున్నారు. జుట్లు ఊడిపోతే గొంతులు పట్టుకుంటారు..."

ఆ రోజు రాత్రి ఊళ్ళో నిద్రపోయిన వాళ్ళ సంఖ్య తక్కువ!

నాయకులు, ఉపనాయకులు ఒకరిపైన ఒకరు రిపోర్టు లిచ్చుకోడానికి పట్టణానికి వెళ్ళడంతో మరునాటి పగలంతా ప్రశాంతంగా గడిచిపోయింది. క్రిందటి రాత్రంతా నిద్రలేకపోవడం మూలాన ఆ రాత్రి 'విషపునీళ్ళు' త్రాగిన పాండవుల్లా గ్రామస్తులు సొమ్మసిల్లి నిద్రపోయారు. తెల్లవారేసరికి పెళ్ళి విడిది ఖాళీగా వుంది నాటకాల వాళ్ళు రాత్రికి రాత్రి వుడాయించేశారు.

* * *

గడిచిన గాథకు అనుబంధంగా ధ్రువపరచడానికి వీల్లేని గాలి కబురు ఒకటి నా చెవిదాకా వచ్చింది. పాతికమైళ్ళ దూరంలో ఒకచోట డేరావేసి ప్రదర్శనాలిస్తున్న నాటకాల వాళ్ళని కలుసుకోడానికి నాగరాజు ఒకానొక రాత్రివేళ వెళ్ళాడనీ, అక్కడ ముందుండి నాటకాలు వేయిస్తున్న బొద్దుమీసాల వీరభద్రయ్య అతణ్ణి అరమైలుదాకా తరుముకున్నాడనీ స్థానికులు కొందరు చెప్పుకున్నారు. నిజమేగావచ్చు. బ్రతుకు పేకాట లాంటిది. నీతి నిజాయితీలు గావచ్చు. సిరిసంపదలు గావచ్చు. అందచందాలు గావచ్చు. గొప్పవాడి ప్రాపకం గావచ్చు - ఆటకు కూర్చున్న తర్వాత కనీసం ఒక తురుపుముక్కయినా చేతికి రాకపోతే, ఆ ఆట చిత్తుచిత్తుగా ఓడిపోతుంది. స్వగ్రామంలో ఉన్న కాస్తాకూస్తా స్థానబలం ఒక్కటే నాగరాజు చేతిలోని తురుపుముక్క. నాటకాల వాళ్ళ తురుపు ముక్క ఎదుట దానికి వున్న ఊళ్ళోనే తీరామారా ఉప్పు పుట్టకుండా పోయింది. ఒక ఊరుదాటిన తర్వాత దాని ఎదుట దీని ప్రతాపం ఏం సాగుతుంది?

నాటకాల వాళ్ళది తిరుగులేని తురుపుముక్క. దేశంలో ఏ మారుమూలలకు వెళ్ళినాసరే- ఎంతటి బలమైన ఎదురాట తారసిల్లినాసరే - అది నిస్సందేహంగా గెలుపు సాధిస్తుంది.

♦ యువ మాసపత్రిక - 1965 ♦